# అతడి కొడుకు

పణతుల రామచంద్రయ్య



ఉదయం తొమ్మిదైంది.

లాయరు శ్రీనివాసరావు కాలకృత్యాలు తీర్చుకుని టిఫినూ కాఫీ పూర్తిచేసి, డ్రెస్సు చేసుక్కూచుని ఏవో 'లా' బుక్సు తిరగేస్తున్నాడు. గడియారం తొమ్మిదయిందని హెచ్చరించగానే ఒకసారి దాని వేపు చూసి తల పంకించి, వీధిలోకి చూసి, "వీళ్ళింకా రాలేదేం చెప్మా!" అనుకున్నాడు.

శ్రీనివాసరావు క్రిమినల్ లాయరు. పసివాడైనా, ప్రాక్టీసులో, ప్రఖ్యాతిలో పెద్దవాడు. నగరంలో ఎరుగున్న వాళ్ళు, మిత్రులూ, తోటి లాయర్లతో సహా, అతణ్ణి 'సీనూ!' అని పిలుస్తారు. ఆఖరికి కోర్టులో మేజిస్ట్రేటు కమలాదేవి కూడా పరిచయాన్నిబట్టి 'సీను గారూ?' అంటుంది. ఇక యింట్లోవాళ్ళ సంగతి చెప్పనక్కర్లేదు.

ఆ రోజు కోర్టులో సీను వాదించబోతున్న కేసు అతడి స్వగ్రామానికి

చందన వాళ్ళది. పార్టీవాళ్లు తొమ్మిది గంటలకే వస్తానన్నారు—ఇంకా రాలేదు. ఎందువల్లనో?

గడియారంలో పెద్దముల్లు ఇంకో అర్ధవలయం చుట్టింది ...... వీళ్ళింకా రారేమిటి?

"ఛ! ఈ పల్లెటూరు గబ్బిలాలతో ఇదే చిక్కు." అనుకున్నాడు సీను.

అసలు తనీ కేసు ఒప్పుకునే వాడు కాదు. కాని నాయుడుగారి బలవంతం వల్ల ఒప్పుకోవలసి వచ్చింది. నాయుడుగారు ఆ వూరి మునసబు. తన తండ్రి జీవించి వున్న రోజుల్లో ఆయనకూ, నాయుడు గారికీ అపరిమితమయిన స్నేహం. ఇద్దరూ అన్నదమ్ముల్లాగా వుండేవాళ్ళు. ఆయన్ని నాయుడుగారు 'అన్నగారూ!' అని పిలిచేవాడు. తనకు మాత్రం—చిన్న తనంలో నాయుడుగారి వద్దగానీ, వాళ్ళ యింట్లోగానీ ఎంతచనువు! ... ఈనాడు గదా, తను బి. యల్. పట్టా మెళ్లో వేసు కొచ్చి బస్తీలో చేరాడు!

అలాంటి నాయుడుగారే వచ్చి, ఈ కేసు తీసుకొమ్మని చెప్పినప్పుడు, తను ముందు కొంచెం సందేహించాడు. నిజానికి అలా సందేహించటానికి సబబైన కారణ మేదీ లేదు. కాని ఆ కేసు తన స్వగ్రామం వాళ్ళది కావటంవల్ల, ఒకవేళ దాన్లో తనకు అపజయం కలిగితే, వాళ్ళముందు తన అంతస్తుకు లోపం వస్తుందేమోనను కున్నాడు...కాదూ మరి! తమ వూళ్ళో, ఇలా యింతవరకు చదివి వృద్ధిలోకి వచ్చింది తను ఒక్కడేనాయె! తనని గురించీ, తన ప్రస్తుతపు స్థితి గురించీ ఎంతోగొప్పగా చెప్పుకుంటారు ఆవూళ్లో. అలాంటిది, ఈ క్లిష్టమైన కేసులో తనకు అపజయమై, ఆ సంగతి ఆ వూళ్లో తెలిస్తే, తన గౌరవానికి ఎంత దెబ్బ!...అంచేత, "ఈ కేసు ఇంకెవరికేనా వప్పచెప్పు బాబాయ్!" అన్నాడు నాయుడుగారితో. తను నాయుడుగారిని చనువు కొద్దీ "బాబాయ్!" అని పిలుస్తాడు.

కాని నాయుడుగారు బలవంతం చేశారు. "నా మీద గౌరవం వుంటే యీ కేసు నువ్వు నడిపించక తప్పదయ్యా!" అన్నాడు. ఆ కేసు నాయుడుగారి నౌకరు వెంకటన్నది. ఆ గ్రామం నిత్యమూ పార్టీ కక్షలతో వుడికి పోతూంటుంది. గ్రామ మునసబు నాయుడుగారు ఒక కక్షకు అధిపతి. ఒకరోజు సాయంకాలం వూళ్లో రామప్ప కాలవ పక్కన, రెండు కక్షలకూ సంబంధించిన వాళ్ళు కొందరు కర్రల్తో కొట్టుకున్నారు. చాలా మందికి మంచి గాయాలు తగిలాయి. గాయాలు తగిలిన వాళ్ళలో నాయుడుగారి నౌకరు వెంకటన్న కూడా వున్నాడు. నాయుడుగారు వెంకటన్న పక్షంలో వుండి దావా నడిపి స్తున్నారు.

ఎలాగైతే నేం, కేసు నడిపించటానికి వొప్పుకున్నాడు సీను. నాయుడుగారు వెళ్లి పొయ్యారు. వెంకటన్నా, ఇంకా అతని

తాలూకు వాళ్లూ ఇప్పుడు వస్తారని చెప్పారాయన. వెంకటన్నతో బాటు అతని భార్యా వాళ్ళూ కూడా వస్తారట !


సీను నవ్వుకున్నాడు.

"ఈ పల్లెటూరి సజ్జు ఎప్పుడూ యింతే!... లేకపోతే, కోర్టుకు వెళ్ళే వాడి వెంట భార్యా బిడ్డలూ దేనికీ? భర్త కోర్టులో భయపడతాడనా?" అనుకున్నాడు.

అయితే వెంకటన్న సకుటుంబంగా రావటం ఒక విధంగా సంతోషంగానే ఉంది తనకు. వెంకటన్నను చిన్నప్పటి నుంచీ ఎరుగును. కాయవాటు మనిషి. అప్పట్నుంచీ యిప్పటివరకూ అతనిలో రవ్వంత మార్పులేదు. చెక్కిన నల్లరాతి విగ్రహంలా ఒక్కలాగే ఉన్నాడు. ఆలాంటి వెంకటన్నకు ఇటీవలే పెళ్ళయిందట – నాయుడుగారు చెప్పారు. పెళ్ళికూతురు బంగారు.

బంగారూ, సీనూ ఒకే వయసువాళ్ళు.

బంగారును గురించి ఆలోచిస్తున్నాడు సీను. బంగారు రంగులో తప్ప మిగతా అన్ని విషయాల్లో బంగారంలా వుండేది. తను ఆ వూరి వీధి బళ్ళో చదివేటప్పుడు ఇద్దరూ ఒకే తరగతి. ఇద్దరూ ఒకచోటే కూచునేవాళ్ళు. బంగారు చదువులో కూడా బంగారే ! బంగారుకు తనకు మల్లే చదువుకునే అవకాశాలు వుండి వుంటే, తనకు బదులు ఆ పిల్ల యూనివర్సిటీ ఫస్టు వచ్చి వుండేది. బంగారు నాన్న రోజూ తాగివచ్చి బంగారునూ, వాళ్ళమ్మనూ పట్టుకు బాదుతుండేవాడు...



"బోడితలతో దిగుతుంటాడు చూడు అన్నాడు ఎవరుంటారు చెప్మా? ."

బంగారు తనతోకూడా అయిదో తరగతి వరకే చదివి మానేసింది.

చిన్నతనంలో బంగారుతో తను ఎంత దోస్తీగా వున్నదీ, అప్పటి ఆటలూ, అల్లరిచేష్టలూ అన్నీ గుర్తుకువచ్చి నవ్వుకున్నాడు సీను.

ఆ తరువాత తనని మద్రాసులో కాన్వెంటులో చేర్చారు. తను సెలవులకు వూరికి వెళ్ళినప్పుడు ఎప్పుడేనా బంగారు కనిపిస్తుండేది. అప్పుడప్పుడు తనని ఎలావున్నావని అడిగేదికూడా. కాని తను స్కూల్ ఫైనలుకు వచ్చాక బంగారుతో మాట్లాట్టం మానేశాడు పూర్తిగా.

ఇప్పుడు బంగారు వెంకటన్న పెళ్ళాం !... వెంకటన్నతో ఎలా కాపరం చేస్తోందో : అసలాపిల్ల వెంకటన్నను చేసుకోడానికి ఎలా వొప్పుకుందంట ! పల్లెటూళ్ళలో మనుషుల జీవితాలిలాగే వుంటాయి. వాళ్ళకీ పట్నవాసపు నాగరి

కతా, ఆడా మగా మధ్య అగాధాలూ, హక్కులూ, విడాకులూ ఏవీ తెలీవు. అయినా ఎంతో హాయిగా, నిర్మలంగా వుంటారు.

సీను వాచీ చూచుకున్నాడు. పదిన్నర. చదువుతున్న 'లా జర్నల్'ను టేబిల్ మీదికి గిరవాటేసి ఒక్కసారి గట్టిగా ఆవలించాడు.

వాకిట్లోకి చూశాడు ... వాళ్ళు వస్తున్నారు!

వెంకటన్నా, బంగారూ, ఇంకా వాళ్ళ తాలూకు మనుషులు నలుగురు వచ్చారు. నాయుడుగారికి వూళ్లో పనులున్నాయని, రెండురోజులాగి వస్తానని చెప్పిపంపారు. వచ్చిన వాళ్ళంతా గోడవార కూచున్నారు. అందరిలోనూ బంగారు ఒక్కతే ఆడ మనిషి.

సీను ఇంకోమారు ఆవలించి లాయరు బెట్టుతనంతో అడిగాడు: "ఇంత ఆలస్యమయిందేం? మీరు తొమ్మిదికే వస్తారని చెప్పారు నాయుడుగారు."

"నిజమే బాబుగోరు! పొద్దున్న బస్సుకే వద్దామనుకుంటే బస్సు దొరకలేదుండీ! అయినా ఎట్టాగేనా పట్టుబస్సుకే రావాలని...ఎక్కడ బాబుగోరు! ఈ ఆడోళ్లు తెమిల్తేనా?" బంగారువేపు చూశాడు వెంకటన్న. బంగారు మొహం సిగ్గుతో వాలిపోయింది. వెంకటన్నకు బంగారు కాస్త కోప్పడ్డట్టు కనిపించింది.

"అదేమంటే కోపం ముంచుకొత్తాది బాబుగోరు, ఈ ఆడోళ్ళకి!" అన్నాడు వెంకటన్న. బంగారు ఇంతవరకూ సిగ్గు పడుతున్నదల్లా ఇప్పుడు నిజంగానే కోపం తెచ్చుకుంది. కాని అంతమందిలో వెంకటన్నను ఏమీ అనేందుకు ధైర్యం చాలక ఊరుకుంది.

సీను నవ్వాడు. అతనికి వీళ్ళ సరసం కాస్త ఎబ్బెట్టుగా కనిపించింది. యాభై యేళ్ళ వెంకటన్నా, పాతికేళ్ళైనాలేని బంగారూ! ఈదాంపత్యం లోకాతీతంగా లేదూ?

చేతిలోని పేపరు చుట్టచుట్టి గెడ్డానికి ఆన్చి పట్టుకుని కాస్త పరిహాస ధోరణిలో అడిగాడు సీను: "అయితే మీ పెళ్ళి ఎప్పుడయింది వెంకటన్నా?"

ఈమారు సిగ్గుపడ్డది యాభై యేళ్ళ వెంకటన్న.

"అయి ఆరేళ్ళవుద్దండీ! ఆ మద్దిన నాయుడుగోరు కాలవకింద పొలాలు కొన్నప్పుడు..ఎక్కడ లేండి బాబుగోరు– అదంతా పేద్ద తతంగం లేండి. నాకు పెళ్లొద్దండీ ఖామందుగోరూ అంటున్నాయినకుండా ఆయనగోరు చేసిన పనండీ యిది ... "చేసుకోరా యేబ్రాసోడా" అనంటూ యీ సద్దిమొహాన్ని తెచ్చి కట్టేశాడు నాకు..."

సీనుకు నవ్వొచ్చింది.

"అయితే వెంకటన్నా, బంగారును

నువ్వు యిష్టంలేకుండానే చేసుకున్నావా?" అన్నాడు.

"అదిగాదు బాబుగోరు! యీ వొయిసులో నాకు పెళ్ళిదేనికి చెప్పండి? నా మునుపటి పెళ్లానిగ్గెనా సంతానం కలిగుంటే అస్సలు దీన్ని కట్టుకునీవోణ్ణా?... పాపం, చచ్చి యేలోకానుందో, అది నిజంగా దరమరాజులాంటి మడిసి..."

"మరి పెళ్ళయి ఆరేళ్ళవుతున్నా బంగారు ఒక్క బిడ్డను కూడా చంక నెత్తలేదేం వెంకటన్నా?" అన్నాడు సీను.

ఈ మాటకు బంగారు మరింత సిగ్గుపడిపోయింది. మోకాళ్ళ మధ్య గెడ్డం ఇరికించుకుని, తల వాల్చుకుని కూచున్న బంగారును చూస్తో, 'ఏ కావ్యనాయిక అయినా యింత సహజంగా సిగ్గు పడగలదా?' అనుకున్నాడు సీను.

తీగల్లే వుంటుంది బంగారు. కొద్దిగా నలుపైన శరీరం. నల్లంచుల వాయిల్ చీర కట్టుకుంది. ఆ చీర పడుచు పెళ్లాం కోసం బస్తీనుంచీ తెచ్చాడు గాఁవల్ను వెంకటన్న:

గంట పదకొండు కావస్తోంది.

"కోర్టుకు టైమవుతోంది. బయల్దేరండి. నేనూ వెనకాలే వస్తున్నాను." అన్నాడు సీను.

* * *

వెంకటన్న కేసు హియరింగు జరిగి మర్నాటికి వాయిదా పడింది. సాక్ష్యాలు చెప్పటం పూర్తయినందువల్ల, వెంకటన్నతోబాటు వచ్చిన నలుగురు మనుషులూ వూరికి వెళ్ళిపోయారు. వెంకటన్నా, బంగారూ మాత్రం మిగిలారు.

కోర్టునుంచి వచ్చాక సీను బట్టలు మార్చుకుని, ముఖం కడుక్కున్నాడు. వెంకటన్ననూ బంగారునూ కూడా మొహాలు కడుక్కోమంటే, వెంకటన్న వద్దన్నాడు.

బంగారు పంపుదగ్గరికి వెళ్ళి మొహం కడుక్కుంటోంది. సీను సబ్బు తీసుకెళ్ళి ఇచ్చాడు.

"ఒద్దులేండయ్యగారు," అంది బంగారు.

"ఎందుకు వద్దు? రుద్దుకోవటం చేతకాదా?" అన్నాడు సీను నవ్వుతూ.

"పోండయ్యగారు!" అంది బంగారు సిగ్గుతో, రవంత కోపంతో. వాళ్ళవూళ్ళో బంగారుకు సబ్బురుద్దుకునే అలవాటులేదు. సీను తెచ్చియిచ్చిన 'సింథోల్' సబ్బు సరిగ్గా మొహానికి పట్టించు కోవటం చేతకాక—పక్కనే నిల్చుని తన అవస్త గమనిస్తున్న సీనునిచూసి మరింత సిగ్గుపడిపోయింది బంగారు.

మొహం కడుక్కుంటున్న బంగారును నఖశిఖ పర్యంతం తదేక దీక్షతో చూస్తున్నాడు సీను... కొద్దిగా నలుపై

వన్నెలు తేలే శరీరం — ఆ శరీరంమీద నల్లంచుల వాయిలుచీర—కదులుతూవున్న నడుము—శరీరంకన్నా కొంచెం నలుపైన మొహం, ఎర్రనిపెదాలూ—ఈ సౌందర్యాన్నంతా ఏ వనదేవతల వద్ద వరం తెచ్చుకుందో! — తల్లో తట్టెడు బంతిపూలు పెట్టింది. నాయుడుగారి తోటలోంచి వెంకటన్నచేత పోరుపెట్టి తెప్పించుకుంది గాఁవల్ను, ఆ పూలన్నీ?

ఈ ఆలోచన రాగానే, పైకే అనేశాడు.

"బంగారూ, నాయుడుగారి తోటలో బంతిచెట్లు తక్కువగా వున్నాయల్లే వుందే!" అన్నాడు. బంగారు మొదట ఈ పరిహాసం అర్థంకాక తెల్లబోయి చూచింది. కాని తర్వాత గ్రహించి, "చాల్లెండయ్యగారు! మీకు మరీ పరాసికంగా వుంది!" అంది. సీనుకు చిన్నప్పటి చిలిపితనం ఇంకా పోలేదు. వీధిబళ్ళో చదివే రోజుల్లో ఎప్పుడూ ఎవర్నో ఒకర్ని ఏడిపిస్తూ వుండేవాడు. బంగారువిగానీ, ఇంకో అమ్మాయివిగానీ పుస్తకాలు దాచిపెట్టి, వాళ్ళ పుస్తకాలు లేనందువల్ల పాఠం వప్పజెప్పటం చేతకాక, మేష్టారు దగ్గర దెబ్బలు తిని రాగాలు తీస్తుంటే అప్పుడు వాళ్ళ పుస్తకాలు వాళ్ళకు తీసుకెళ్ళి ఇచ్చేవాడు. ఈ సంగతి మేష్టారు తెలుసుకుని, తనని కూడా నాలుగు తగల్నిస్తే, తనూ వాళ్ళతోబాటు శ్రుతి కలిపి రాగం తీసేవాడు...

ఎలాగో మొహం కడుక్కోవటం పూర్తి చేసింది బంగారు.

తుడుచుకోడానికి తుండుగుడ్డ అందించాడు. వద్దని చీర చెరగుతో తుడుచుకోబోయింది. బలవంతంగా తుండుగుడ్డ బుజంమీద వేశాడు.

"పరవాలేదులే తుడుచుకో! మరీ అంత సిగ్గుపడిపోతే ఎలా? ఇంకా పెళ్ళికూతురివి కాదుగా!" అన్నాడు.

మొహం తుడుచుకుంది. తేటగా, అద్దంలా ప్రతిఫలిస్తున్నది బంగారు మొహం. "ఇప్పుడెంతఅందంగావుంది!" అనుకున్నాడు సీను. ఆడవాళ్ళకు యవ్వనంతోబాటే అందంకూడా తప్పనిసరిగా వస్తుంది గాఁవల్ను! లేకపోతే, బంగారు మొహం ఇంతగా నిగ్గుదేలి వుండేదా చిన్నప్పుడు?... బంగారు నాయనమ్మని వూళ్ళో అందరూ "నిప్పుకోడి" అని పిలిచేవాళ్ళు. ఆ "నిప్పుకోడి" ప్రతిరోజూ బంగారుకు అర్ధసేరు నూనె రాచి తల దువ్వేది. బళ్ళో, ఆ నూనె మొహం మీదికి కారుతోంటే, చోళీతో తుడుచుకుంటూ, గెసపోసుకుంటూ మాట్లాడుతుండేది బంగారు. ఆ నూనె మొహానికీ, ఈ మొహానికీ ఎక్కడ పోలిక?

బంగారు మొహం తుడుచుకుని తుండుగుడ్డ, సబ్బు పట్టుకుని లోపలికి వెళ్ళబోయింది. సీను అడ్డంగా నిల

బడ్డాడు. ఇదేమిటో అర్థం కాక తెల్లబోయింది బంగారు. అతడు ఎదురుగా నిల్చివున్న బంగారును రెండు చేతులతోనూ దగ్గరికి లాక్కుని, గుండెలకు హత్తుకుని ముద్దుపెట్టుకున్నాడు.

బంగారు ఒక్క క్షణంపాటు అయోమయంగా వుండిపోయింది, మరుక్షణంలో కోపం తెచ్చుకుని "ఇదేంటయ్యా గారు !" అంటూ విదిలించుకుని లోపలికి దూసుకుపోయింది. ఆ వురవడిలో చేతిలోని సబ్బుపెట్టె జారి రాతినేలమీదపడి దబ్బున చప్పుడు చేసింది.

సీను భయపడ్డాడు. ఎంత పొరబాటు జరిగిపోయింది !... తను నిజంగా పొరబాటుచేశాడా ? ఏమో, అలాగని మనస్సు ఒప్పుకోవటం లేదు. అసలీ కేసు పుచ్చుకున్నప్పట్నుంచీ బంగారును గురించిన ఆలోచనలే తన మనస్సును ఆక్రమించుకున్నాయి !... మరో విధంగా అయితే తను ఇలా ప్రవర్తించకుండా వుండేవాడా ? ఉహుఁ. బంగారు తన చిన్ననాటి నేస్తం, ఆ స్నేహం బంగారు మీద ఏదో హక్కును, అధికారాన్నీ తనకు ఇచ్చినట్లనిపించింది !

బంగారు చేతిలోంచి జారిపడిన సబ్బును తీసి చేతపట్టుకుని మెల్లగా అడుగులు వేస్తూ లోపలికి వెళ్ళాడు సీను. బంగారు ఈ విషయం వెంకటన్నతో చెప్పివుంటుందేమోనని అతడికి లోలోపల చాలా భయంగా వుంది.



"నేను అక్కడ ఉన్నప్పుడు ఏమైందనుకున్నావ్ భూకంపంలా వచ్చి నేనున్న ఇల్లు అటు ఇటు భయంకరంగా ఊగిపోతూ ఇంట్లో సామానులన్నీ తల్లక్రిందులై పడిపోయాయి ఇంకా. ."

"ఒరేయ్ ఆగు ఇది చెప్తుంటే జ్ఞాపకం వచ్చింది, మా ఆవిడ పోస్టులో వేయమన్న ఉత్తరం, పోస్టు చెయ్యడం మరిచిపోయాను. వేసేసి వస్తాను ఉండు."

వరండాలో కూచుని, ఈ ప్రపంచంతో తనకు నిమిత్తమే లేనట్టుగా రామదాసు కీర్తనలు పాడుకుంటున్న వెంకటన్నను చూసి కాస్త స్తిమితపడ్డాడు సీను. బంగారు వెంకటన్నతో ఏమీ చెప్పినట్టు లేదు ! నిజంగా చాలా మంచిది బంగారు ! మరి చిన్ననాటి స్నేహితుని పట్ల ఆ మాత్రం ప్రేమ లేకపోతుందా ఆ పిల్లకు?

కుర్చీలో కూచుని ఏదో వారపత్రిక తిరగేయసాగాడు. వెంకటన్న లోపలికి వచ్చాడు.

"కూచో వెంకటన్నా" అన్నాడు సీను.

వెంకటన్న గడపదగ్గర కూచున్నాడు. బంగారు వచ్చి గోడకానుకుని నిల్చుంది. సీను బంగారుమొహంలోకి చూడలేక పొయ్యాడు.

"కాలం మా సెడ్డగావుంది బాబు గోరు!" అన్నాడు వెంకటన్న.

ఈ మాటకు సీను భయపడ్డాడు. కొంపదీసి బంగారు ఏమీ చెప్పలేదుగదా?

తమాయించుకుని, "ఏమిటన్నావు వెంకటన్నా?" అన్నాడు.

"అదే బాబుగోరు, రోజులు యిపరీతంగా మారిపోతున్నాయి. లేకపోతే చూడండీ, నాయుడుగోరు దేవుడు లాంటోరు గదా, ఆ మారాజుతో సినరెడ్డికి యిరోదం దేనికి చెప్పండీ? వుంటేమానె, ఆ సినరెడ్డితో యీ గాండ్లోంళ్ళంతా చేరటం దేనికంట, ఎదవలు గాకపోతే? అస్సలు మంచికి కాలంలేదు బాబుగోరు! బ్రెమ్మంగోరు వూరికే అన్నారా..."

సీను కిప్పుడు ధైర్యం వొచ్చింది... తను వూరికే వూహించుకుని భయపడ్డాడు!...బంగారు...నిజంగా బంగారం!!

"అవును వెంకటన్నా! మంచికి రోజులు లేవు" అన్నాడు.

తరువాత వెంకటన్న ఏమిటేమిటో చెప్పుకొచ్చాడు. వూళ్ళో కక్షలు, వాళ్ళ పగసాధించుకోవటం, వాటిల్లో నాయుడు గారి పాత్ర, ఇంకా గ్రామంలోని రాజకీయాలు, పంటలు, వర్షాలు గురించి చాలా చెప్పాడు. గ్రామానికి అంతపెద్ద చెరువు వున్నా, దానివల్ల వాళ్ళకు వుపయోగం లేదట. ఏటా వర్షాకాలంలో అది నిండినప్పుడల్లా చిన్నరెడ్డి రహస్యంగా తన మనుషుల్ని పంపి దానికి గండి పెట్టిస్తాడట. అలా చేయటం వల్ల ఆయనకు లాభమేమిటంటే, ఆ గండి పూడ్చటానికి సర్కారు వాళ్ళు ఆయనకు కంట్రాక్టు ఇస్తారట.

ఇలాంటి విషయాలు చాలా చెప్పాక, ఉన్నట్టుండి ఏదో స్ఫురించినట్టుగా అడిగాడు వెంకటన్న: "అయితే మీరు పెళ్ళి చేసుకునే దెప్పుడు బాబుగోరు?"

సీను నవ్వాడు...నిజమే! త్వరలో తను పెళ్ళి చేసుకోవాలి. దూరాన, ప్రస్తుతం పెద్దన్నయ్య దగ్గరవున్న అమ్మ నాన్నా కూడా యీ విషయం పదేపదే వ్రాస్తున్నారు.

"మరి పెళ్ళి చేసుకోవా లంటావా వెంకటన్నా?" అని అడిగాడు నవ్వుతూ. అసలీ ప్రశ్న ఎందుకు వేశాడో అతడికే తెలీదు.

"అలాగంటారేం బాబుగోరు! పెళ్ళి చేసుకోకుండా యిలాగే వుండిపోతారా యేంటి?" అన్నాడు వెంకటన్న ఆశ్చర్య పడుతూ.

"ఉండకేం చెయ్యమన్నావు, బంగారు లాంటి అమ్మాయిల్నందర్నీ నీబోటి వాళ్ళు ఎగరేసుకు పోతుంటేనూ—!" అనుకున్నాడు మనస్సులో. వెంకటన్నకు సమాధానంగా చిరునవ్వు నవ్వాడు.

"ఇప్పుడప్పుడే అయ్యగారు పెళ్ళి చేసుకోరేమోలే?" అంది బంగారు.

ఈ మాట కొరడా కొసలా తగిలింది అతడికి.

* * *

కేసు ముగిసింది. వెంకటన్నకు అనుకూలంగా తీర్పు చెప్పబడింది. అవతలి పక్షం వాళ్ళకు శిక్షలు, నూరేసి రూపాయిల దాకా జరిమానాలు పడ్డాయి.

వెంకటన్న ఆనందానికి హద్దులులేవు. చిన్నరెడ్డి పార్టీవాళ్ళు ఇనుప కటకటాల వెనుక నిల్చోవటం మనసులో వూహించుకుని అతడు చాలా సంబరపడ్డాడు. "ఎదవలు! మా బాగా బుద్దొస్తుందిలే! మళ్లీ జన్మలో మా జోలికి రావాలంటే దమ్ములుండవ్ ఆళ్ళకి!" అనుకున్నాడు. ముఖ్యంగా ఆ నాగులు గాడు — వాడికి మూణ్ణెల్లు ఖయిదు వేశారు. వేసేముందు తనని అడిగివుంటే, వాడికి వురిశిక్ష వెయ్యమనేవాడు. వాడు కోడివాటాన బలిసి పొగరెక్కిపొయ్యాడు! లేకపోతే, తనకి పొలంలోకి సద్ది తీసుకొస్తున్న బంగారును చూసి కన్ను గీటుతాడూ? గుడ్లు పీకేవాళ్ళు లేరని!

సీను కూడా చాలా సంతోషపడ్డాడు. అతడికి మొదట్లో చాలా సందేహంగా వుండేది, ఇదిచాలా చిక్కైన కేసని కాని వాదించటానికి పూనుకున్నాక ధైర్యం వచ్చింది. తన అంచనాను మించి కేసు విజయవంత మయింది!

ఆ రోజు యింటికి వచ్చాక, వెంకటన్న కోర్టులో విశేషాలు బంగారుకు వివరిస్తున్నాడు—కేసు ఎలానడిచిందీ, మేజిస్ట్రేటు ఎలా తీర్పుచెప్పిందీ, తమకు వేసిన శిక్షలు వినేటప్పుడు ఆ 'ఎదవల' మొహాలు ఎలా పాలిపోయిందీ...

"మన అయ్యగోరు మా బాగా మాట్లాడేరే యెర్రిమోహం దానా! మేస్త్రీరీటమ్మకూడా అదిరిపోయిందనుకో—" అన్నాడు.

బంగారు ఎటో చూస్తో, పరధ్యానంగా వూకొడుతోంది.

ఆ సాయంత్రం వెంకటన్న పంచె కొంగులోంచి కొన్నినోట్లుతీసి సీనుకివ్వబోయాడు. సీను తీసుకోలేదు...

ఆ రాత్రి వెంకటన్న సినిమాకు వెళ్ళాడు. బంగారుకూడా వస్తానంటే వెంకటన్న వద్దన్నాడు. సీను కూడా. అది కొత్తసినిమా అనీ, రద్దీఎక్కువనీ, ఆడవాళ్ళకు టిక్కెట్లు దొరకటం కష్టమనీ అన్నాడు.

* * *

మర్నాడు బంగారు, వెంకటన్న వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళేటప్పుడు, వూళ్లో తమపొలాలను జాగ్రత్తగా కనిపెట్టి వుండమని చెప్పాడు సీను వెంకటన్నకు.

తరువాత నాయుడుగారు ఒకసారి వచ్చారు. సీనును చాలా మెచ్చుకున్నారు. కేసు ముగిశాక చాలా రోజులదాకా సీను పేరు మోత మోగిపోయిందట వూళ్లో.

త్వరలో ఒకసారి వూరికి రమ్మని సీనును ఆహ్వానించారు నాయుడుగారు.

*     *     *

ఆ తర్వాత ఎనిమిదేళ్ళు గడిచాయి.

సీనుకు పెళ్ళై భార్య కాపురానికి వచ్చింది. అమ్మాయి జిల్లా మునసబు వెంకటరావుగారి చిన్నకూతురు కుసుమ కుమారి.

ఈ ఎనిమిదేళ్ళలోనూ సీను స్వగ్రామానికి ఒకసారి వెళ్ళిరావాలని ప్రయత్నించాడుగానీ తీరుబాటు లేక పోయింది. పెళ్ళయ్యాక, నాయుడుగారు వచ్చి నిర్బంధం చెయ్యగా, ఆయనమాట కాదనలేక దంపతులిద్దరూ ప్రయాణమై వెళ్ళారు.

వాళ్ళకు వూళ్ళో నాయుడుగారి బంగళాలో బస ఏర్పాటుచేశారు. వాళ్లు వచ్చారనితెలిసి,చూచిపోవటానికివచ్చాడు వెంకటన్న. వెంకటన్న మామూలుగా వూళ్లో వ్యవహారాలను గురించీ, తన కుటుంబం గురించీ చాలా చెప్పాడు.

"బంగారు కులాసాయేనా?" అని అడిగాడు సీను.

కులాసాయే నన్నాడు వెంకటన్న. ఇప్పుడు బంగారుకు కొడుకుట !

ఆ రోజు మధ్యాన్నం భోంచేసి పడుకుని బాగా నిద్రపోయాడు సీను. నిద్రలేచి మొహం కడుక్కొని వాకిట్లోకి వచ్చేసరికి కుసుమ ఎవరో కుర్రాణ్ణి ప్రశ్నలు వేస్తోంది.

"ఎవరు పంపించారీ పళ్ళు ?"

"మా అయ్య."

"మీ అయ్య పేరేమిటి?"

"వెంకటన్న."

వెంకటన్న కొడుకు సన్నగా, పొడుగ్గా, ఎర్రగా వున్నాడు.

కుసుమ వెంకటన్న పంపిన సపోటా పళ్ళు లోపలికి తీసుకువెళ్ళింది. వెంకటన్న కొడుకు అలాగే వాకిట నిల్చున్నాడు.

"లోపలికి రావోయ్." అన్నాడు వాణ్ణి సీను.

వాడు లోపలకి వచ్చాడు. వచ్చి బల్ల మీద కూచోబోతుంటే, ఎదురుగావున్న నిలువుటద్దంలో వాడి ప్రతిబింబం చూసి ఉలిక్కిపడ్డాడు సీను ... అంతా తన పోలికే! అచ్చుగుద్దినట్టు—తన మొహమే!...ఆ కళ్లూ...ఆ జుత్తూ...!

"నీ పేరేమిటి?" అన్నాడు సీను, వాడి పక్కనే కూచుంటూ.

"రాములు."

రాములు వూరికే బెదురుచూపులు చూస్తున్నాడు.

అంతలో పళ్లు తీసుకొచ్చిన బుట్ట తెచ్చి వాడికిచ్చింది కుసుమ. అది తీసుకు వెళ్ళిపోయాడు రాములు.

"ఆ కుర్రాడెవరో తెలుసా ?" అంది కుసుమ.

ఎవరు ? ఆ కుర్రాడు ఎవరు ? ?— తనను తనే ప్రశ్నించుకున్నాడు సీను.

"ఆ కుర్రాడు దోసపండులాగాలేడూ? అయితే, ఎవరి కొడుకో తెలుసా మీకు?"

"తెలుసు. బంగారు కొడుకు."

"బంగారు వాళ్ళమ్మ పేరా?"

"అవును."

"మీకెలా తెలుసు!"

"ఎందుకు తెలీదు? చిన్నప్పట్నుంచీ వాళ్లు మాకు తెలుసు." అన్నాడు సీను. కుసుమకు ఎలాంటి అనుమానమూ రాలేదు.

రాములు మళ్ళీ ఒకసారి వస్తే బాగుండు ననుకున్నాడు సీను...రాములు తన కొడుకు! ఇది లోకానికి మరుగైన సత్యం! కాని లోకానికి తెలియకూడదు. తెలిస్తే తన ప్రతిష్టకూ, అంతస్తుకూ గంగాస్నానం జరుగుతుంది హితులంతా శత్రువులవుతారు. దగ్గరి వాళ్ళంతా దూర మవుతారు. ఇవేవీ జరక్కుండా వుండా లంటే తనకూ, రాములుకూ మధ్య రక్తబంధాలు సాధ్యమయినంత వరకూ తెగాలి; లేదా అదృశ్యంగా వుండాలి.

సీను చాలా బాధపడ్డాడు. అతడి మనస్సు పర్జన్యఘోష పెట్టింది.

ఈ వైపరీత్యానికి మూలమయిన తప్పు ఎక్కడుంది?...తనలోనే! అందిన ఫలాన్ని అనుభవించాలనే గాఢంగా వాంఛించాడు తను. ఆ అనుభవపు పరిణామాలు రక్తబంధాలను సవాలు చేసినప్పుడు — వాటికి తన ప్రతిష్టను,



"ఏమిటోయ్ మీ ఆవిడంటే నీ కంత భయ మేమిటోయ్ నీ పేంటుకి బొత్తాలు కుట్టి పెట్టమని ఆమాత్రం చెప్పలేవూ? నీ పేంటుకు నువ్వు బొత్తాలు కుట్టుకోడం నా కళ్ళారా చూశాను."

"ఛా అది నా పేంటుకి కాదు మా ఆవిడ కుడుతూంట!"

---

అంతస్తును పణంగా పెట్టవలసి వుంటుందనిపించలేదు ఆనాడు......

ఇప్పుడది సమస్యగా ఎదురై నిల్చింది!...తన ప్రతిష్ట, రాములు — చెరోవైపునా వున్నారు. తనకు ఏది ఉపాదేయం?...ఒకవేళ తాను తన ప్రతిష్టనూ గౌరవాన్నీ భగ్నంచేసుకున్నా రాములు తనవాడవుతాడా? — ఉహుఁ. పైగా తత్ఫలితంగా ఎన్నో దుస్సంఘట టనలు జరుగుతయ్. కుసుమ, ఇతర ఆత్మీయులు, నాయుడుగారివంటి ఆప్తులు, వెంకటన్న — అందరూ తనకు దూర మవుతారు. వెంకటన్న శత్రువవుతాడు. పల్లెటూరి ప్రజల పగ ప్రళయాగ్నికన్నా తీవ్రం! దానిలో బంగారూ రాములూ

కూడా ఆహుతికారని నమ్మకమేమిటి ?... ఇలాంటి ఘోరాలేవీ జరగకుండా వుండా లంటే, యీ రహస్యం తనలోనే, బంగారులోనే అణగారిపోవటం మంచిది. వేరే మార్గం లేదు......

ఏది ఏమైనా, తనకీ పల్లెటూళ్లో ఎనిమిదేళ్ళ కొడుకు ఒకడున్నాడు. వాణ్ణి తను మరచిపోలేడు. రాములు ఈ పల్లెటూళ్ళో మగ్గిపోకుండా తనంత వాడు కావాలి. అందుకోసం తాను చెయ్యగలిగిన దంతా చెయ్యాలి...రాములు అచ్చు తన ప్రతిబింబం ! తనలోని జీవాగ్నిలోని అంశ ! వాడు లోపలికి వచ్చి కూచుని వున్నంత సేపూ తనకొక అపూర్వాను భవం కలిగింది !

అతడికి, తను విద్యార్థిదశలో చదువుకున్న దుష్యంతుడి కథలో పద్యం జ్ఞప్తికి వచ్చింది :

"...ముక్తాహార కర్పూర సాంద్రపరాగ ప్రసరంబు,
చందనము, చంద్రజ్యోత్స్నయున్,
పుత్రగాత్ర పరిష్వంగమునట్లు జీవులకు
హృద్యంబే ? కడున్ శీతమే ?''

—ఇది దుష్యంతుడికి శకుంతల చేసిన సవాలు ! తనను ఏలుకోనన్న దుష్యంతుడికి కుమారుడు భరతుణ్ణి చూపించి,

''చక్రవర్తీ ! వీణ్ణి ఒక్కసారి కౌగిలించుకుని చూడు. ఆ పరిష్వంగ సౌఖ్యం అనుభవించి చెప్పు, వీడు నీ కొడుకో, కాదో !" అంటుంది ఆమె. చిన్నతనంలో ఆ పద్యానికి పూరికే తాత్పర్యం చదువుకోవటం తప్పిస్తే భావం అంతగా అవగతం కాలేదు. ఇప్పుడది మనసా, వాచా, కర్మణా అనుభవానికి అందుతోంది !

ఆ సాయంత్రం—

కుసుమ నాయుడుగారింట్లో ఆడవాళ్ళతో బాతాఖానీ వేస్తున్నది. సీను బంగళావరండాలో ఈజీఛేర్‌లో పడుకుని వున్నాడు.

ఆ సమయంలో బంగారు వచ్చింది. బంగారులో ఏమీ మార్పులేదు. కొంచెం పల్చబడింది. అంతే.

"బాగున్నావా బంగారూ ?" అన్నాడు సీను.

"బాగున్నాను." అంది. కాసేపయ్యాక తల వంచుకుని, "కొడుకుని చూశారా?" అంది.

బాధగా నవ్వాడు.

"చూశాను" అన్నాడు.

బంగారు ఏమీ మాట్లాడలేదు. తల వంచుకునే, బొటనవేలుతో నేల మీద రాస్తూ నిలబడింది.

"బంగారూ !" అన్నాడు మళ్ళీ.

బంగారు తలెత్తిచూసింది. ఆమె కళ్ళ నిండా నీళ్లు !

"ఏడవకు బంగారూ !...ఈవిషయం మనిద్దరికీ తప్ప మూడో మనిషికి తెలియనివ్వకూడదు !...రాములు నావాడు.

వాణ్ణి నేను పైకి తీసుకొస్తాను... సరేనా!...వాణ్ణి బడికి పంపిస్తున్నావా?" అన్నాడు.

పంపిస్తున్నానని చెప్పింది బంగారు. రాములు క్లాసులో అందరిలోకీ చాలా తెలివైనవాడుట. వాడి తెలివితేటల్ని గురించి టీచర్లు ద్వారా విన్న నాయుడు గారు వాణ్ని తాము పెద్ద చదువులు చదివిస్తామన్నారట!

సీనుకు సంతోషమయింది. కాని తనంతటి వాని కొడుకు, ఇలా ఒకరి పోషణలో వుండి చదువుకోవలసి వచ్చిందే అన్న బాధ కూడా కలిగింది.

తరువాత కొద్దిసేపు మాత్రం వుండి బంగారు వెళ్ళిపోయింది.

బంగారు వెళ్ళిపోతుండగా గేటు దగ్గర కుసుమ ఎదురయింది. కుసుమ లోపలికి వస్తూ "ఎవరావిడ?" అని భర్త నడిగింది.

"ఎవరూ?" అన్నాడు సీను ఆలో చనల్లోంచి తేరుకుని.

''ఇప్పుడటు వెళ్లలా...''

''అదా...? ఓ ఆడమనిషి లే. ఆవిడది యీ వూరే.''

కుసుమకు నవ్వొచ్చింది. ''ఈ రెండు విషయాలూ మీలాంటి గొప్పవాళ్ళే చెప్పగలరు గాని—ఆవిడ ఎవరూ అని అడుగుతున్నాను.'' అంది.

"అలా అడుగు మరీ...ఆవిడ పేరు బంగారు. వెంకటన్న భార్య." అన్నాడు సీను, కుర్చీ వెనక నిలబడిన కుసుమ చేతిని చేతిలోకి తీసుకుంటూ.

"ఆవి డెందు కొచ్చింది?"

"మనల్ని చూడ్డానికి."

"మరి నన్ను చూడలేదే?"

"మనిద్దరం ఒకటేగా! అందుకని నన్ను చూస్తే నిన్ను కూడా చూసినట్టే గదా అని వెళ్ళిపోయుంటుంది."

కుసుమ ఈసారి కూడా నవ్వుతూ, "మాటలు బాగా నేర్చారు!" అని అతడి చెవి మెలిపెట్టి లోపలికి వెళ్ళింది. సీను కూడా ముసిముసిగా నవ్వుకుంటూ, సాగ దీయబడ్డ చెవి తడుముకుంటూ, తనని తానే అభినందించుకున్నాడు, కుసుమకు ఎలాంటి అనుమానమూ రాకుండా చెయ్య గలిగినందుకు.

మర్నాడు పొద్దున — కాలకృత్యాలు పూర్తిచేసి, నాయుడుగారింటి నుంచి కాఫీ రాకకోసం. ఎదురుచూస్తున్న సీనుకు, వాకిట్లో కుసుమ ఎవరినో కేకలేయటం వినిపించింది.

''వెధవా! కళ్ళు నెత్తికొచ్చి నయ్యోరా? రెండు కప్పులూ నీమొహాన పెట్టుకున్నావు!" అని గదమాయిస్తోంది కుసుమ.

''గడప కాళ్ళకు తగిలిందండమ్మ గోరు.'' అని మెల్లగా, దీనంగా సమా ధానం చెబుతున్నాడు ఆ ముద్దాయి ఎవరో. ఆ కంఠం తనకు పరిచిత మయిందిగా వినిపించటంవల్ల,గబుక్కున

లేచి వాకిట్లోకి వచ్చాడు సీను, ఎవరో చూద్దామని.

ఆ ముద్దాయి రాములు !

సీనుకు అర్థమయింది. రాములు నాయుడుగారింట్లోంచి కాఫీతీసుకొచ్చాడు. వస్తూ గుమ్మం తగిలి బోర్లాపడ్డాడు. కాఫీ నేల కలిసిపోయి, గ్లాసులు పగిలి పోయినయ్. గ్లాసులు పగిలిపోతే మానె, పొగలు కక్కే కాఫీ ఎందుకూ కొరగా కుండా పోయిందేఅన్న కుసుమ విచారం కోపంగామారిరాములుమీదికిదూకుతోంది.

"ఏమిటి గోల ?" అన్నాడు సీను.

"మీకు గోలగా వున్నాయా నా కేకలు ? వాడు చేసినపని చూడండి. వీడి దుంప ముడెయ్య..."

"నోరు ముయ్యవే." అన్నాడు సీను రెచ్చిపోయి, "కాఫీ దొర్లిపోయినంత మాత్రానికే ఇంతగా కేకలు పెట్టాలా ? మనింట్లో మనం ఆ మాత్రం పొరబాట్లు చెయ్యకుండానే బతుకుతున్నామా ? మనం చేసే పొరబాటే ఎదుటివాళ్ళుకూడా చేసి నప్పుడు అంత నోరు చించుకోనవసరం లేదు. వాళ్ళు మనకన్నా తక్కువదశలో వున్నా, మనలాంటి మనుషులే..."

ఈ మాటల్లో కోపంకన్నా బాధ ఎక్కువగా ధ్వనించింది. అవ్యక్తమయిన రక్తబంధం ప్రేరేపించగా, శృంఖలాబద్ధ మయిన పితృ హృదయం పరవళ్ళు తొక్కగా అతడలా మాట్లాడేశాడు గాని, ఆ మాటలకు మొహం కందగడ్డల్లె చేసుకుని బొటబొటాకన్నీళ్ళు కార్చుతున్న కుసుమను చూసి నిరుత్తరుడై పోయాడు. ఎదురెదురుగా ప్రవహించే ప్రవాహాలు సంఘర్షించినప్పుడు వాటి మధ్య చిక్కు కున్నట్లయింది అతడి పరిస్థితి. కుసుమ నోరు ఎంత పెళుసయిందో మనస్సంత మెత్తనిది. ఇది సీనుకు బాగా అవగాహన అయిన విషయం.

కుసుమ గిరుక్కున తిరిగి లోపలికి వెళ్ళిపోయింది.

రాములు ఒక్క అడుగు కూడా కద ల్లేదు. అయోమయంగా, తలవంచుకు నిలబడ్డాడు. కుసుమ వెళ్ళిపోయాక, వాడు నేలమీద పగిలిపోయి పడివున్న గాజు ముక్కలు ఏరి పారెయ్యబోయాడు. వాటిల్లో ఓ గాజుముక్క వాడి చేతిలో ఇరుక్కుని నెత్తురు తెప్పించింది.

"అఁ ! అదేంపని ?" అంటూ వెళ్ళి వాడిచేతిలో ఇరుక్కున్న గాజు ముక్కు లాగి పారేశాడు సీను. కారుతున్న నెత్తురు జేబుగుడ్డతో తుడిచేశాడు. రాములు నొప్పి అణచుకోవాలని ప్రయత్నం చేస్తున్నా, ఎనిమిదేళ్ళు నిండని పసికుంక— వాడు ఓర్చుకోలేక పోతున్నాడు. వాడి కళ్ళల్లో నీళ్ళు వచ్చాయి.

"పాడు గ్లాసులు–పోతే పోనీలేబాబూ! వాటికోసం ఇలా చేతుల్ని పాడుచేసుకో వచ్చా చెప్పు ?" అంటూ రాముల్ని తీసు కొచ్చి లోపల కూచోబెట్టాడు సీను.

రాములు కిదంతా కలలాగావుంది. సిగ్గు, భయం వేస్తున్నయ్.

వాడు తలవంచుకునే కూచున్నాడు.

"అమ్మగారు కేకలేశారని కోపంగా వుందా రాములూ ? అమ్మగారు ఎప్పుడూ అంతేలే... పైకి అలా కేకలేస్తుంది గాని, అమ్మగారు చాలా మంచిది.'' అన్నాడు సీను, అనునయిస్తున్నట్టుగా.

రాములు చాలా సందిగ్ధంలో పడ్డాడు. తనని అమ్మగారు వూరికే కేకలేసినమాట నిజమే అయినా, అందుకోసం అయ్యగారు ఇంతగా వాత్సల్యం చూపటంతో వాడు ఉక్కిరిబిక్కిరై పోయాడు సీను వేసే ప్రశ్నలకు మరింత బెంబేలు పడిపోవటం తప్ప, సమాధానం చెప్పలేదు వాడు,

కుసుమ వచ్చింది. రాములు వేలిన నెతురు వస్తూండటంచూసి ఆమెకు జాలేసింది.

భార్యాభర్తలిద్దరూ కలిసి వాడి గాయానికి కట్టుకట్టారు.

"వాడు నువ్వు కేకలేశావని భయపడి ఆ గాజు ముక్కలన్నీ ఏరి పారెయ్యబోయాడు...ఓ గాజుముక్క చేతిలో ఇరుక్కుంది..." అన్నాడు సీను.

కుసుమకు మరింత జాలేసింది.

"పాపం!" అన్నది కుసుమ, "నేను కాఫీ పారబోశాడని వూరికే కేకలేశాను... అంతేగానీ, వాడి చేతుల్తో ఆ గాజు ముక్కలు ఏరమంటానా ? ... ఏం, రాములూ ? నా మీద కోపంగా వుందా?"

అంది, వాడి గెడ్డం పట్టుకుని మొహం పైకెత్తుతూ. రాములు కోలమొహం, మెరిసే కళ్ళూ చూసి—వాడు ఈ పల్లెటూరి సజ్జులో పుట్టవలసినవాడు కాదని కుసుమ అంతకుముందే అనుకుంది.

రాములు అప్రయత్నంగా నవ్వాడు.

ఆ నవ్వు ఆమె హృదయంలో ఏవో అలల్ని రేపింది. ఏదో రహస్యం చెప్పినట్లయింది. ఆమె మరొక్కమారు వాడికేసి చూసి, తర్వాత సీనువేపు తీక్షణంగా చూసి లోపలికి వెళ్ళిపోయింది.

సీను తెల్లబోయాడు

* * *

ఆ సాయంత్రం కుసుమ సీనుతో అంది.

"మనం రేపు వెళ్ళాలి.''

సీను ప్రశ్నార్థకంగా చూశాడు. 'అదేమిటి ? మొన్ననేగా అన్నావు, ఈ వూళ్లో దినాలు క్షణాల్లాగా గడిచిపోతున్నాయని?'

"అవును—అన్నాను. ఇప్పుడు వెళ్లాలంటున్నాను. నా కిక్కడ వుండడమంటే ఎలాగో వుంది."

''కొంపలంటుకుంటాయా, వెళ్ళకపోతే?''

''అంటుకుంటాయేమో, ఎవరికి తెలుసు ? మీ కిష్టమయితే మీ రొక్కరే ఉండండి...నే నుండలేను.''

ఆ మర్నాడే వాళ్ళప్రయాణం. వాళ్లు అంత తొందరగా బయర్దేరి వెళ్ళిపోడానికి కారణమేమిటో నాయుడుగారింట్లో కూడా ఎవ్వరికీ తెలీదు. ★